
సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం । 8 । మే । 2025



వాసవీ మాత జయంత్యుత్సవం

శాంతిథాంలో వాసవీ మాత జయంతి ఉత్సవాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. పతాకావిష్కరణ, గోపూజలు నిర్వహించి ఉత్సవం ప్రారంభించారు. 10లో ▸



ఆక్వాకు ఆక్సిజన్ గండం

పూటకోరకంగా మారుతున్న వాతావరణం ఆక్వాకు గండంగా మారింది. ఆక్వా రంగం కుదుట పడుతున్న సమయంలో ఈ మార్పులు కునుకులేకుండా చేస్తున్నాయి. 10లో ▸



రెడ్‌క్రాస్.. సేవలు భేష్

యుద్ధాలు, విపత్తులు, ఆరోగ్య సంక్షోభం, అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు అపన్న హస్తాన్ని అందించి రెడ్ క్రాస్ అందరీ మన్ననలు అందుకుంటోంది. 10లో ▸

న్యూస్‌రీల్

మర్యాద పూర్వక కలయిక



జగన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ముదునూరి మురళీకృష్ణంరాజు

భీమవరం: వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ నరసాపురం పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ పరిశీలకుడిగా తనను నియమించినందుకు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు.

మైనార్టీలకు సబ్సిడీ రుణాలు

భీమవరం (ప్రకాశంచౌక్): వ్యక్తిగత సబ్సిడీ రుణాలు పొందేందుకు మైనార్టీలు(ముస్లి, క్రిస్టియన్, బుద్ధులు, జైనులు, సిక్కులు, పార్సీలు) దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఇతర సందేహాలకు 08812 242463 నెంబరులో సంప్రదించాలని కోరింది.

చేనేత గుర్తింపు కార్డులకు ఆన్‌లైన్ దరఖాస్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): చేనేత, చేనేత అనుబంధ వృత్తుల్లో కొనసాగుతున్న కార్మికులకు జారీ చేస్తున్న కార్డులు ఇక మీదట కార్యాలయాల్లో మంజూరు చేయరని, ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని చేనేత, జౌళి శాఖ అధికారులు తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను క్షేత్ర స్థాయిలో అర్హతను పరిశీలించి గుర్తింపు కార్డులు మంజూరు చేస్తారన్నారు. గుర్తింపు కార్డులను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పారు.

ప్రశాంతంగా ఐసెట్

భీమవరం: పట్టణంలో బుధవారం నిర్వహించిన ఐసెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. డీఎన్నార్ డిగ్రీ కళాశాలలో ఉదయం పరీక్షకు 100 మందికి 95 మంది హాజరుకాగా మధ్యాహ్నం పరీక్షకు 100 మందికి 92 మంది హాజరయ్యారు. డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 110 మందికి 100 మంది హాజరుకాగా మధ్యాహ్నం పరీక్షకు 100 మందికి 93 మంది హాజరయ్యారు. విష్ణు ఉమెన్స్ కళాశాలలో ఉదయం పరీక్షకు 100 మందికి 86 మంది, మధ్యాహ్నం పరీక్షకు 100 మందికి 93 మంది హాజరుకాగా విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం పరీక్షకు 93 మందికి 86 మంది, మధ్యాహ్నం పరీక్షకు 93 మందికి 85 మంది హాజరయ్యారు.

ఆపరేషన్ సిందూర్ సాహసోపేత చర్య



కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ

భీమవరం: ఉగ్రవాద శిబిరాలపై భారత త్రివిధ దళాలు నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ సాహసోపేత చర్యగా నిలిచిందని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ చెప్పారు. బుధవారం భీమవరంలో ఆయన మాట్లాడుతూ.. ఈ దాడుల ద్వారా భారతదేశం ఉగ్రవాదంపై ఎంత కఠినంగా వ్యవహరిస్తుందో మరోసారి స్పష్టమైందన్నారు. భారత్ చేసిన దాడి ఆక్రమిత కాశ్మీర్‌లో ఉగ్రవాద శిబిరాలపై దాడే తప్ప పాకిస్థాన్‌పై కాదని స్పష్టం చేశారు. దేశ రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకునే చర్యలకు పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఏ సమస్యనైనా సామరస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు.

సప్లిమెంటరీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

భీమవరం: టెన్త్, ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్‌ఓ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం కలెక్టరేట్ చాంబర్‌లో సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇంటర్ పరీక్షలు మే 12 నుంచి మే 20 వరకు జరుగుతాయన్నారు. 40 కేంద్రాలలో 18,265 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. పదో తరగతి పరీక్షలు మే 19 నుంచి మే 28 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు 26 కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. పదవ తరగతి పరీక్షలకు 5,613 మంది హాజరుకానున్నట్లు తెలిపారు. ఓపెన్ స్కూల్‌కు మే నెల 19 నుంచి 24 వరకు పరీక్షలు జరుగుతాయని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ భీమారావు, డీఐఈఓ ఏ.నాగేశ్వరరావు, అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో దళారీ రాజ్యం

- దళారులు నిర్ణయించిన ధరకే అమ్మకాలు
- మిల్లుల్లో రైతుల పేరిట దళారులే విక్రయిస్తున్న వైనం
- గత ప్రభుత్వంలో దళారులకు చెక్
- దిగుబడిపై అంచనా లేక రైతుతో చెలగాటం



కొవ్వలిలో రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ధాన్యం కొనుగోళ్లలో తెర మరుగైన దళారీ వ్యవస్థ కూటమి సర్కారు పాలనలో ఊపిరిపోసుకుంది. పూర్తిగా సర్కారు మద్దతుతో దళారులు నేరుగా కొనుగోళ్లకు తెరలేపారు. దీంతో రైతులకు మద్దతు ధర దక్కడం లేదు. మరోవైపు వేలం పాట తరహాలో ప్రతి వారం టార్గెట్లు తగ్గించడం, పెంచడం వంటి చర్యలతో కొనుగోళ్లు నిలిచిపోయి తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొంది. ఫలితంగా మద్దతు ధర ఉన్నా అన్నదాతకు అందని పరిస్థితి. ఈ ఏడాది ఏలూరు జిల్లాలో 77 వేల ఎకరాల్లో 3.53 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి వచ్చింది. పశ్చిమగోదావరి జిల్లాలో 2.20 లక్షల ఎకరాల విస్తీర్ణంలో 9.25 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి వచ్చింది. రెండు జిల్లాలో 50 శాతం టార్గెట్‌తో రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోళ్లు ప్రారంభించింది. ఏలూరులో 1.50 లక్షలు, పశ్చిమగోదావరిలో 5 లక్షల మెట్రిక్ టన్నులు టార్గెట్‌గా నిర్ణయించారు. ఈ క్రమంలో రైతు సంఘాలు, రైతుల నుంచి టార్గెట్ పెంచాలన్న ఒత్తిడితో దశలవారీగా పెంచే క్రమంలో దళారులకు పూర్తి అవకాశం కల్పించారు. రబీ సీజన్ ప్రారంభ సమయంలో రూ.1740 ఉన్న ఏ- గ్రేడ్ రకం, రూ.1725 ఉన్న సాధారణ రకం 75 కేజీల బస్తా దళారుల దెబ్బకు రూ.1300కు పడిపోయింది.

సేవా కేంద్రాల్లోనూ దళారులే

రైతు సేవా కేంద్రాల్లోనూ దళారుల హవా కొనసాగింది. గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రం వద్ద రైతుల వివరాలు నమోదు చేసి వే బ్రిడ్జిలో కాటా వేయించి ట్రక్ షీట్ తీసుకుంటే అక్కడ నుంచి నేరుగా మిల్లుకే వెళ్ళిపోతుంది. ఏ మిల్లుకు వెళ్ళింది వివరాలు తెలియకపోవడంతో ధర తగ్గించడం, తరుగు పేరుతో కొంత తీయడం ఇలా ఘటనలకు ఆస్కారం ఉండేది కాదు. ఇప్పుడు నేరుగా నచ్చిన మిల్లుకు తోలుకోవడంతో మిల్లర్లు నిర్ణయించిన ధరే రైతుకు అందుతుంది. తరుగు, తేమ శాతం ఎక్కువగా ఉందని రేటు తగ్గిస్తున్నారు. గోనెసంచులకు పూర్తిగా మిల్లర్లపైనే ఆధారపడి ఉన్నారు. వీటన్నింటితో పాటు వందలాది గ్రామాల్లో దళారులే రైతుల వద్ద ధాన్యం సేకరించి రైతుల పేరుతో ట్రక్‌షీట్ జనరేట్ చేయించి క్వింటాకు ఖర్చులతో కలిపి రూ.200 నుంచి రూ.300 వరకు అవసరాన్ని బట్టి కమిషన్ తీసుకుని ధాన్యం విక్రయిస్తున్నారు. జిల్లాలో సగటున రూ.1400 నుంచి రూ.1500 లోపే రైతుకు దక్కుతుంది.

వేలం పాట తరహాలో కొనుగోళ్ల లక్ష్యం

ఏలూరు జిల్లాలో కొనుగోళ్ల లక్ష్యం వేలం తరహాలో సాగింది. తొలుత 1.50 లక్షల టన్నులు లక్ష్యంగా నిర్ణయించారు. తరువాత 1.80 లక్షల టన్నులు, ఆ తరువాత 2 లక్షల టన్నులు, ఆ తరువాత 2.50 లక్షల మెట్రిక్ టన్నులు, చివరిగా బుధవారం 2.70 లక్షల మెట్రిక్ టన్నులు నిర్ణయించారు. పశ్చిమగోదావరి జిల్లాలో 9.25 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడికి గాను 5 లక్షల టార్గెట్ నిర్ణయించారు. మంత్రి మనోహర్ మంగళవారం భీమవరంలో పర్యటించిన క్రమంలో ఇంకో లక్ష టార్గెట్ పెంచారు.

పెట్టుబడి కూడా రాలేదు



50 ఎకరాలు కౌలుకు సాగు చేశాను. సార్వాలో నష్టం వచ్చినా దాళ్వాలోనైనా గిట్టుబాటుకు అమ్మి నష్టాన్ని పూడ్చుకుందామనుకున్నా. మాసూళ్ల ప్రారంభంలో పండించిన ప్రతి గింజ కొంటామని అధికారులు, కూటమి ప్రభుత్వ పాలకులు హామీలిచ్చారు. వారి మాటలు నమ్మి రైతు సేవా కేంద్రానికి వెళితే టార్గెట్లు అయిపోయాయని చెప్పి సంచులు ఇవ్వడం మానేసారు. పెట్టుబడులు రాని పరిస్థితి ఏర్పడింది.

– పెద్దిరెడ్డి భోగయ్య, కౌలు రైతు, ఎంఎంపురం, భీమడోలు మండలం

దళారులకు ప్రభుత్వం పెద్దపీట



చివరి గింజ వరకు కొంటామని చెప్పి వారానికో టార్గెట్ పెట్టి రైతులను తీవ్ర ఆగచాట్లకు గురిచేస్తున్నారు. జిల్లాలో పంట నష్టం వాటిల్లినా మొక్కుబడి నివేదికలు తప్పా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతి గింజ కొనుగోలు చేశాం. దళారుల ఆస్కారం లేకుండా చేస్తే కూటమి ప్రభుత్వం దళారీ వ్యవస్థకు పెద్దపీట వేసింది.

– దూలం నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు

కోస్తా తీరంలో రెడ్ అలర్ట్

- డ్రోన్లతో గస్తీ ముమ్మరం
- ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్



ఏలూరు టౌన్: భారత ప్రభుత్వం పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసేందుకు యుద్ధం చేస్తోన్న నేపథ్యంలో ఏలూరు రేంజ్ పరిధిలోని కోస్తా తీర ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితి దృష్ట్యా రేంజ్ పరిధిలోని తీర ప్రాంతంలో రెడ్ అలర్ట్ పెట్టామని ఏలూరు రేంజ్ ఐజీ చెప్పారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ శివ కిశోర్‌తో కలిసి బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కోస్తా తీర ప్రాంతంలో కోస్ట్‌గార్డులను అప్రమత్తం చేశామని చెప్పారు. డ్రోన్ కెమెరాలతో పటిష్ట భద్రత, నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, భద్రతా చర్యలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఏలూరు రేంజ్‌లో నేరాల శాతం గణనీయంగా తగ్గిందని తెలిపారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో దర్యాప్తు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని స్పష్టం చేశారు. ఏలూరు రేంజ్ పరిధిలో 22 వేలకు పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని ఐజీ స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కీలకమైన కేసుల్లో కఠిన శిక్షలు పడేలా దర్యాప్తు చేపట్టాలని ఐజీ జీవీజీ అశోక్ కుమార్ ఆదేశించారు.

రాజస్థాన్ గ్యాంగ్ హనీ ట్రాప్

- సంపన్నులే లక్ష్యంగా లక్షల్లో వసూలు
- ముఠా వేటలో పోలీసులు

తాడేపల్లిగూడెం: సంపన్నులే లక్ష్యంగా రాజస్థాన్‌కు చెందిన ముఠా సభ్యులు హనీ ట్రాప్ చేసి రూ.లక్షల్లో డబ్బులు గుంజుతున్నారు. అమ్మాయిలతో ఫోన్ చేయించి ముందుగా ముగ్గులోకి దింపుతారు. ఆ తర్వాత వారి బలహీనతలు తెలుసుకుని వల విసురుతారు. వారికి మన పర్సనల్ వీడియోలు, ఫొటోలు చిక్కాయంటే వాటిని సోషల్ మీడియాలో పెడతామని బెదిరించి డబ్బులు దండుకుంటారు. ఇలా రాజస్థాన్‌కు చెందిన బ్యాచ్ జిల్లాలో హల్‌చల్ చేస్తున్నట్టు సమాచారం. బ్యాచ్‌గా వచ్చిన కొందరు ప్రధాన పట్టణాల్లో ఆస్తులు పుష్కలంగా ఉన్న వ్యక్తుల ఆధార్ కార్డులు, ఇతర సమాచారం తెలుసుకునని ట్రాప్ చేస్తున్నారు. ఈ ముఠా వలలో తాడేపల్లిగూడెం టూటౌన్ ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి చిక్కుకున్నట్టుగా సమాచారం. పెద్ద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడం, పలుకుబడి ఉండడంతో సదరు వ్యక్తి భయపడి సుమారు రూ.50 లక్షలు సమర్పించుకున్నట్లు సమాచారం. ముఠా వేధింపులు ఆగకపోవడంతో అతను పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు ఆ ముఠా ఆచూకీ కనుగొనే పనిలో పడ్డారు. ఈ క్రమంలో రాజస్థాన్ వెళ్లి సుమారు 11 రోజులు మకాం వేశారు. మరోవైపు ఇక్కడ పోలీసులు ముఠాలోని ఇద్దరు సభ్యుల ఆచూకీ తెలుసుకుని రూ.12 లక్షలు రికవరీ చేసినట్టుగా తెలుస్తోంది. మిగిలిన సభ్యులను పట్టుకునే పనిలో ఉన్నారు. ఇలాంటి ముఠాలు ఇంకా ఉన్నాయా? అన్న విషయాన్ని తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

జిల్లా అభివృద్ధికి పటిష్ట చర్యలు

ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి



జిల్లా అభివృద్ధి సమీక్షా మండలి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

భీమవరం: జిల్లా సమగ్రాభివృద్ధికి పటిష్ట చర్యలు చేపట్టామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవి కుమార్ చెప్పారు. బుధవారం కలెక్టరేట్‌లో మంత్రి అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమీక్షా మండలి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ.. గత ఆరు నెలలుగా జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. అనంతరం మంత్రి రవికుమార్ వ్యవసాయ శాఖపై సమీక్షించారు. రైతులకు లాభసాటిగా ఉండే వరి వంగడాలను సాగుకు సూచించాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. 50 శాతం సబ్సిడీపై టార్పాలిన్లను అందించేందుకు ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రులలో మంచి పరికరాలున్నా వాటిని వినియోగించడానికి టెక్నీషియన్ల కొరత ఉందని దీనిని ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేయాలన్నారు. జల వనరుల శాఖపై మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్షిస్తూ నియోజకవర్గాలవారీగా క్షేత్రస్థాయిలో అవసరమైన పనులను గుర్తించి చేపట్టేందుకు స్థానిక ఎమ్మెల్యేలతో మాట్లాడి పనులు చేపట్టాలని ఆదేశించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ కాలువలు, డ్రెయిన్ల పూడిక పనులు చేపట్టాలని కోరారు. యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన మూడు బ్రిడ్జిలకు అప్రోచ్ రోడ్లు లేక ట్రాఫిక్ పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు పాక వెంకటసత్యనారాయణ, రాష్ట్ర ఎస్‌సీపీసీ చైర్‌పర్సన్ పీతల సుజాత, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామారాజు, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తదితరులు పాల్గొన్నారు.

5.21 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు

భీమవరం: ప్రస్తుత రబీ సాగుకు సంబంధించి జిల్లాలో 263 రైతు సేవా కేంద్రాల ద్వారా 55,983 మంది రైతుల నుండి 5.21 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేశామని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం రైస్ మిల్లర్స్ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో ధాన్యం సేకరణ, గన్ని బ్యాగులు సరఫరాపై సమీక్ష నిర్వహించారు. రూ.1,200 కోట్లకు గాను రూ.1,130 కోట్లు రైతులు ఖాతాలో జమ చేశామన్నారు.

బ్రహ్మోత్సవ వైభవం



స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా ముస్తాబు చేస్తున్న దృశ్యం

- అట్టహాసంగా వైశాఖ దివ్య బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- పెండ్లి కొడుకుగా చిన్న వెంకన్న ముస్తాబు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- గజ వాహనంపై అట్టహాసంగా తిరువీధి సేవ



శ్రీమహావిష్ణు అలంకారంలో శ్రీవారు

బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 7గంటల నుంచి–భజన కార్యక్రమాలు
- 8 గంటల నుంచి – భక్తిరంజని
- మధ్యాహ్నం12 గంటల నుంచి – కూచిపూడి నృత్య ప్రదర్శనలు
- సాయంత్రం 4గంటల నుంచి–నాదస్వరకచేరి
- 5 గంటల నుంచి – హరికథ
- 6గంటల నుంచి–కూచిపూడి నృత్య ప్రదర్శనలు
- రాత్రి 8 గంటల నుంచి – అంకురార్పణ, రుత్విగ్వరణ, ధ్వజారోహణం
- 9 గంటల నుంచి – హంసవాహనంపై శ్రీవారికి తిరువీధి సేవ
- 9 గంటల నుంచి – సురభి నాటకం
- శ్రీవారి ప్రత్యేక అలంకారం : మత్స్యావతారం

ద్వారకాతిరుమల: సర్వాభరణ భూషితుడైన శ్రీవారు పెండ్లి కుమారుడిగా, నుదుటున కల్యాణ తిలకం.. బుగ్గన చుక్కలతో పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లు పెండ్లి కుమార్తెలుగా శోభిల్లారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమలలో శ్రీవారి వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత ఆలయ ఏఈఓ పి.నటరాజారావు శ్రీహరి కళాతోరణ వేదికపై జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలు ప్రారంభించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయం నుంచి నిత్య కల్యాణ మండపం వద్దకు తొళక్క వాహనంపై తీసుకెళ్లారు. అక్కడ పుష్పమాలికలతో విశేషంగా అలంకరించిన వేదికపై ఏర్పాటు చేసిన రజిత సింహాసనంపై శ్రీవారు, అమ్మవార్లను వేంచేపు చేసి అలంకరించారు. ఆ తరువాత మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితులు, ఆగమ విద్యార్థుల వేద మంత్రోచ్చరణల నడుమ పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేసే వేడుకను నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి దంపతులు స్వామి, అమ్మవార్లకు పూలు, పండ్లు సమర్పించి, పూజాధికాలు నిర్వహించారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ వైభవంగా జరిగిన ఈ వేడుక చూపరులకు కనువిందు చేసింది. శ్రీహరి కళాతోరణ వేదికపై నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలంకరించాయి. రాత్రి గజ వాహనంపై స్వామివారి తిరువీధి సేవ వైభవంగా జరిగింది. ఆలయ ముఖ మండపంలో స్వామివారి శ్రీమహావిష్ణు అలంకారం భక్తులకు నేత్రపర్వమైంది.



గజ వాహనంపై ఉభయ దేవేరులతో క్షేత్ర పురవీధులకు తరలివెళ్తున్న శ్రీవారు



ఉభయ దేవేరులతో నిత్య కల్యాణ మండపం వద్దకు తరలివెళ్తున్న శ్రీవారు

అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకం



నివాళులర్పిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ స్ఫూర్తిదాయకమని కలెక్టర్ చదలవాడ నాగరాణి కొనియాడారు. బుధవారం అల్లూరి వర్ధంతి సందర్భంగా జువ్వలపాలెం రోడ్డులోని అల్లూరి సీతారామరాజు స్మృతి వనం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కాంస్య విగ్రహం వద్ద పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతికి అల్లూరి చేసిన సేవలను కొనియాడారు. మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, కంతేటి వెంకటరాజు, లైన్ ఇంటర్నేషనల్ సీహెచ్ కృష్ణంరాజు, గాదిరాజు సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరికి నివాళి

భీమవరం: తెల్లదొరల దురాగతాలపై తెగించి పోరాడిన తెలుగు ధీరుడు అల్లూరి సీతారామరాజు అని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. అల్లూరి వర్ధంతిని పురస్కరించుకొని పోలీస్ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బ్రిటిష్ వారి దుర్మార్గ పాలనను ఎదిరించి, ఆంధ్రా గిరిజనులకు ధైర్యాన్ని, న్యాయాన్ని నేర్పించిన యోధుడని కొనియాడారు.

నకిలీ పత్రాలతో ఆస్తుల తనఖా

- నరసాపురం సెంట్రల్ బ్యాంకు ఉదంతంతో అప్రమత్తం
- పర్యవేక్షణ లేని ఆస్తులపై కన్ను
- నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి బ్యాంకుల్లో కుదవ



నరసాపురం సెంట్రల్ బ్యాంకు కార్యాలయం

నరసాపురం: నరసాపురం తీరంలో లోన్ స్కాం ఇటీవల కాలంలో బాగా పెరిగాయి. నరసాపురం సెంట్రల్ బ్యాంకులో వెలుగులోకి వచ్చిన రుణాల స్కాంతో చుట్టు పక్కల ఆస్తులు ఉన్నవారు ఉలిక్కి పడ్డారు. తమ ఆస్తులకు సంబంధించిన పత్రాలు ఏమైనా ఉన్నాయా? ఎవరైనా తమకే తెలియకుండా తమ భూముల్ని బ్యాంకుల్లో కుదవపెట్టారా? అనే అనుమానంతో కొందరు ఆస్తుల దస్తావేజులు బయటకు తీసి ఆరా తీస్తున్నారు. ఇటీవల నరసాపురం చుట్టు పక్కల ప్రాంతాల్లో పర్యవేక్షణ లేని ఆస్తులపై కొన్ని ముఠాల కన్ను పడింది. వాటి పేరుతో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి బ్యాంకుల్లో కుదువపెడుతున్నారు. 2018లో నరసాపురం తీర ప్రాంత భూముల్లోని చేపల చెరువులపై దొంగ లీజు పత్రాలు సృష్టించి కొందరు కృష్ణా జిల్లాలోని బ్యాంకుల్లో కుదువపెట్టిన ఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది.

స్థానికంగా లేని వారి ఆస్తులపై కన్ను

స్థానికంగా ఆస్తులు ఉండి.. హైదరాబాద్ వంటి నగరాల్లో స్థిరపడిన వారు, తమ ఆస్తులపై పర్యవేక్షణ లేని వారిని టార్గెట్ చేస్తున్నారు. వారి ఆస్తుల వివరాలు సేకరించి, నకిలీ పత్రాలతో బ్యాంకుల్లో రుణాలు తీసుకుంటున్నారు. బ్యాంకు రుణాలు ఇప్పించే బ్రోకర్లతో దస్తావేజుల లేఖర్లు జతకట్టి అజమాయిషీ లేని ఆస్తులు ఎక్కడ ఉన్నాయో ఆరాతీస్తున్నారు. కొందకు బ్యాంకు అధికారులతో లాలూచీ పడి రూ.కోట్ల మొత్తంలో రుణాలు కాజేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు శాఖ ఈ అక్రమ దందాపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు.

గత 3 ఏళ్లలో రూ.250 కోట్ల మంజూరు

సెంట్రల్ బ్యాంకు రుణాల స్కాంలో మొత్తం వ్యవహారం పట్టణానికి చెందిన మాధవ్ అనే రుణాల బ్రోకర్ నడిపినట్టు తెలుస్తోంది. అతను మిగిలిన బ్యాంకుల్లో ఇలాంటి రుణాలు ఇప్పించినట్టు సమాచారం. బ్యాంకు అధికారులను మేనేజ్ చేయడం, నకిలీ పత్రాలు సృష్టించడం.. వాటిని బ్యాంకుల్లో తాకట్టుపెట్టడం వంటి విషయాలు అతనే చూసుకుంటాడు. నరసాపురంలోని అన్ని బ్యాంకుల్లో చెరువుల లీజు డాక్యుమెంట్ల ఆధారంగా గత 3 ఏళ్లలో రూ.250 కోట్ల మేర రుణాలు మంజూరైనట్టుగా తెలిసింది. సెంట్రల్ బ్యాంకు ఘటనతో అన్ని శాఖల బ్యాంచ్‌లు అప్రమత్తమయ్యాయి. తమ బ్యాంకుల్లో చెరువుల లీజు డాక్యుమెంట్లపై ఇచ్చిన రుణాల వివరాలు మరోసారి పరిశీలించుకునే పనిలో పడ్డారు.

సెంట్రల్ బ్యాంకు స్కాంలో సెటిల్‌మెంట్?

సెంట్రల్ బ్యాంక్‌లో సుమారు రూ.4 కోట్ల రుణాల స్కాం సెటిల్‌మెంట్ చేసుకున్నట్లు తెలుస్తోంది. బాధితులు ఇప్పటికీ పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. గొడవ జరిగినా పోలీసులు ఫిర్యాదు అందలేదన్న కారణంతో ఎలాంటి కేసు నమోదు చేయకపోవడం కూడా విమర్శలకు తావిస్తోంది. సెంట్రల్ బ్యాంకులో అసలు కుంభకోణం ఎంతమేర జరిగింది, బ్యాంకు అధికారుల పాత్ర ఏంటి, బాధితుల ఆరోపణల్లో నిజానిజాలు తదితర అంశాలను తేటతెల్లం చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది. వారు మౌనంగా ఉండడంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి.

క్లుప్తంగా

భీమవరంలో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు



భీమవరం రైల్వే స్టేషన్‌లో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు చేస్తున్న దృశ్యం

భీమవరం: పాకిస్తాన్ ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో భీమవరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు బాంబ్‌స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని జనం రద్దీగా ఉండే టౌన్ రైల్వేస్టేషన్, మల్టీప్లెక్స్ తదితర ప్రాంతాల్లో పోలీసు జాగీలం, మెటల్ డిటెక్టర్స్‌తో టూటౌన్ సీఐ జి కాళీచరణ్ నేతృత్వంలో తనిఖీలు నిర్వహించారు.

జిల్లాల సరిహద్దులు నిర్ణయించిన సర్వేయర్లు



గ్రామంలో జిల్లాల సరిహద్దులు నిర్ణయిస్తున్న సర్వేయర్లు, అధికారులు

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం వెంకటాద్రి అప్పారావు పురం (వీఏ పురం) గ్రామంలో రీసర్వేలో భాగంగా ఉంగుటూరు మండలానికి, పెంటపాడు మండలం వెస్టు విప్పర్రు గ్రామానికి సరిహద్దులు తేల్చారు. బుధవారం గ్రామంలో జరిపిన సర్వేలో ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా సరిహద్దులు కూడా నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ రమణ, ఉంగుటూరు మండల సర్వేయర్ విశ్వనాథ్, తాడేపల్లిగూడెం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే రౌతు రామకృష్ణ, ఉంగుటూరు డిప్యూటీ తహసీల్దార్ పూర్ణచంద్రప్రసాద్, బొమ్మిడి వీఆర్వో ప్రసాదు, పెంటపాడు మండల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అలరించిన శ్రీనివాస కల్యాణం నృత్య రూపకం



శ్రీవారి ఆలయ ఆవరణలో శ్రీనివాస కల్యాణం నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

ద్వారకాతిరుమల: శ్రీవారి వైశాఖ మాస దివ్య బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన శ్రీనివాస కల్యాణం నృత్య రూపకం చూపరులను అలరించింది. తణుకుకు చెందిన అంబికా డాన్స్ అకాడమీ సభ్యులు ముందుగా శ్రీవారు, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం శ్రీనివాసుడు, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్ల నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ నృత్య రూపకాన్ని ఆసక్తిగా తిలకించారు.

రెడ్ క్రాస్.. సామాజిక సేవలు భేష్

- అత్యాధునిక పరికరాలతో రాయలంలో కార్యాలయం ఏర్పాటు
- అందుబాటులో హోల్‌బ్లడ్, ఎర్రరక్త కణాలు, ప్లాస్మా, ప్లేట్‌లెట్స్
- సేవలకుగాను నేడు అవార్డు అందుకోనున్న కలెక్టర్



రాయలంలో రెడ్ క్రాస్ సొసైటీ భవనం

భీమవరం అర్బన్ : రక్తం అవసరమైనవారికి ప్రాణదాత.. విపత్తులు, యుద్ధాల్లో ఉన్నవారికి ఆపద్బంధువు.. రోగులకు, అన్నార్తులకు అందించే ఆపన్నహస్తం.. రెడ్‌క్రాస్. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ రెడ్‌క్రాస్ ప్రజల మన్ననలు అందుకుంటోంది. మే 8న ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా జిల్లాలో రెడ్‌క్రాస్ అందిస్తున్న సేవలపై కథనం.

రాయలంలో రెడ్ క్రాస్ రక్తనిధి ఏర్పాటు



నూతన జిల్లా ఏర్పడ్డాక ఇక్కడి ప్రజలకు రక్త అవసరాన్ని గుర్తించి 2022లో అప్పటి కలెక్టర్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు పి.ప్రశాంతి నేషనల్ రెడ్ క్రాస్ ద్వారా రూ. కోటి 50 లక్షలతో అత్యాధునిక పరికరాలను మంజూరు చేయించారు. అంతేకాకుండా రాయలం పంచాయతీ కార్యాలయం పక్కనే గల ప్రభుత్వ భవనాన్ని బ్లడ్ బ్యాంకు కోసం కేటాయించారు. ఉద్యోగులు, ప్రజల నుంచి జిల్లా శాఖ కోటి రూపాయల మేర విరాళాలు సేకరించి భవనంలో వైద్య పరికరాలు, వసతులు కల్పించారు. గతేడాది నవంబర్ 18న ప్రస్తుత జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు, కలెక్టర్ సీహెచ్ నాగరాణి బ్లడ్ బ్యాంకును ప్రారంభించారు.

అత్యాధునిక పరికరాల్లో బ్లడ్ నిల్వ

తణుకు, నరసాపురంలోని రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకులు హోల్ బ్లడ్‌ను మాత్రమే అందిస్తాయి. రాయలంలో ఏర్పాటు చేసిన రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో అత్యాధునిక పరికరాల ద్వారా రక్తాన్ని ప్రాసెసింగ్ చేసి హోల్ బ్లడ్‌తో పాటు ఎర్ర రక్తకణాలు, ప్లాస్మా, ప్లేట్‌లెట్స్ అందించే విధంగా ఆధునిక వసతులు కల్పించారు. రోగి భద్రత, సమగ్రమైన పరీక్షల నిర్వహణకు ప్రాధాన్యమిస్తూ రక్తం, రక్త భాగాలను సురక్షితంగా భద్రపరిచేందుకు క్రయోఫ్యూజ్, బ్లడ్ కలెక్షన్ మానిటర్లు, మైనస్ 40 డిగ్రీలు, మైనస్ 80 డిగ్రీల ఫ్రీజర్లు, బ్లడ్ ఎనలైజర్లు తదితర అత్యాధునిక, సాంకేతిక రక్త పరీక్షల పరికరాలను ఏర్పాటు చేశారు. బ్లడ్ బ్యాంకు సామర్థ్యం 8 వేల యూనిట్లు నిల్వ ఉండే విధంగా జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణి చర్యలు తీసుకున్నారు.



రక్తదానం చేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి నారాయణ, ఉపాధ్యాయులు (ఫైల్)

దాతల అవసరం లేకుండానే

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు బ్లడ్ బ్యాంకులు రక్తాన్ని అమ్మకూడదు. దాత నుంచి సేకరించాక మరొకరి శరీరంలోకి ఎక్కించేందుకు సురక్షితమో కాదో నిర్ధారించే పరీక్షలు, భద్రపరిచేందుకు అవసమైన ప్రాసెసింగ్ చార్జీలు మాత్రమే తీసుకోవాలి. ప్రైవేటు బ్లడ్ బ్యాంకుల్లో దాతలు రక్తాన్ని ఇచ్చిన తరువాత రోగికి కావాల్సిన బ్లడ్ గ్రూపుల రక్తాన్ని విక్రయిస్తారు. రెడ్‌క్రాస్ సొసైటీలో దాత అవసరం లేకుండా రోగికి కావాల్సిన బ్లడ్‌ను ప్రభుత్వం నిర్ణయించిన ప్రాసెసింగ్ చార్జీలతో అందజేస్తారు.

అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఏర్పాట్లు

రక్తం కొరతను తీర్చడం, అత్యవసర పరిస్థితులు, శస్త్ర చికిత్సల సమయంలో సేవలు అందించే లక్ష్యంగా ఈ కేంద్రం పనిచేస్తుంది. రక్తసేకరణ, పరీక్ష, ప్రాసెసింగ్ స్టోరేజీలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేశాం. నిదుల సమీకరణ, సభ్యత్వాల ద్వారా బ్లడ్ బ్యాంకు నిర్వహణకు కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఎనలేని సహకారం అదిస్తున్నారు.

– డాక్టర్ భద్రిరాజు, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్, భీమవరం

అందుబాటులోకి తలసేమియా డే కేర్ సెంటర్

మే 8న ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా రాయలంలోని రెడ్ క్రాస్ సొసైటీలో తలసేమియా డే కేర్ సెంటర్‌ను ప్రారంభించనున్నారు. ఈ సెంటర్‌లో రక్తమార్పిడినే కాకుండా ఎప్పటికప్పుడు ఉచితంగా రక్తాన్ని అందిస్తారు.

ప్రతి నెలా రక్తదాన శిబిరాలు

ప్రతి నెలా మొదటి, మూడో శుక్రవారాల్లో జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బందితో రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నారు. 2023–24లో వచ్చిన గోదావరి వరదల్లో నష్టపోయిన ప్రజలకు రూ.20 లక్షల విలువైన డ్రై రేషన్ కిట్లు, కిచెన్ సెట్‌లు పంపిణీ చేశారు. అగ్ని ప్రమాదాల సమయంలో బాధితులకు టార్పాలిన్, బ్లాంకెట్లు, ఆపదలో ఉన్న వారికి ఆహార పదార్థాలు అందించారు. అంతేకాకుండా అనాథ ఆశ్రమాల్లో కంటి పరీక్షలు, ఉచితంగా కళ్లద్దాలు అందించారు. రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా ఆస్పత్రులకు ఉచిత ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు, వీల్ ఛైర్లు అందించడం, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలతో రెడ్ క్రాస్ సొసైటీ సేవలు భేష్ అనిపించాయి. కలెక్టర్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ సీహెచ్ నాగరాణి 2024–2025 కాలానికి రూ.36 లక్షల నిధులు ఈ సేవల కోసం సమీకరించారు. జిల్లాలో రెడ్ క్రాస్ సొసైటీ అందించిన సేవా కార్యక్రమాలకుగాను మే 8న విజయవాడలో రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా కలెక్టర్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు సీహెచ్ నాగరాణి అవార్డు అందుకోనున్నారు.

గ్రంథాలయాల్లో సమస్యలు పరిష్కరించండి



ఏలూరు జిల్లా గ్రంథాలయంలో పుస్తకాలు పరిశీలిస్తున్న గ్రంథాలయ చైర్మన్ కోటేశ్వరరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని గ్రంథాలయాల్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక నాయకులు ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరావును కలిసి వినతిపత్రం సమర్పించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయానికి నూతన భవనాన్ని నిర్మించాలని, గ్రంథాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, గ్రామీణ దళిత గిరిజన ఆవాసాల్లో ప్రత్యేక గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఏలూరు కార్పొరేషన్ నుంచి రూ. 8 కోట్ల సెస్ బకాయిలు వసూలు కావాల్సి ఉన్న విషయాన్ని గుర్తించామన్నారు. దీనిపై కమిషనర్‌తో మాట్లాడానని, త్వరలోనే సెస్ బకాయిలు గ్రంథాలయ సంస్థకు చెల్లించాలని సూచించానన్నారు. జిల్లాలో అన్ని గ్రంథాలయాలను ఆధునిక హంగులతో పాఠకులకు అందుబాటులోకి తెస్తామన్నారు. కోటేశ్వరరావును కలిసిన వారిలో వేదిక గౌరవ సలహాదారు ఆలపాటి నాగేశ్వరరావు, జిల్లా కన్వీనర్ నాగాస్త్ర, జిల్లా కో కన్వీనర్ దేవరకొండ వెంకటేశ్వర్లు, సంఘ సభ్యులు ద్రోణాదుల శ్రీనివాస్, మేతర అజయ బాబు, జే. కృష్ణ ప్రసాద్ ఉన్నారు. తొలుత ఆయనకు గ్రంథాలయ సభ్యులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

వైభవంగా వాసవీ మాత జయంత్యుత్సవం



వాసవీ మాత గ్రామోత్సవంలో పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతీ స్వామీజీ

పెనుగొండ: అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతిధాంలో వాసవీ మాత జయంతి ఉత్సవాలను బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతీ స్వామిజీ(బాలాస్వామి) పర్యవేక్షణలో పతాకావిష్కరణ, గోపూజలు నిర్వహించి జయంతి ఉత్సవం ప్రారంభించారు. మరకత శిల వాసవీ మాతకు అభిషేకాలు, విశేష పూజలు, సామూహిక లక్షపుష్పార్చన నిర్వహించారు. వాసవీ మాల దారులు హోమాలు నిర్వహించి అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకొన్నారు. స్థానిక బజారు రామాలయం నుంచి శ్రీనగరేశ్వర మహిషాసుర మర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయం వరకూ అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు కలశాలతో మూలవిరాట్ వాసవీమాత వద్దకు చేరుకొని అభిషేకాలు చేశారు. వేదపండితులు రామడుగుల నరసింహమూర్తి నేతృత్వంలో ఆలయ ప్రధాన అర్చకుడు కోట వెంకట సుబ్రహ్మణ్యం నగరేశ్వర స్వామికి రుద్రాభిషేకం, అమ్మవార్లకు కుంకుమార్చనలు నిర్వహించారు. కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణా రాష్ట్రాల నుంచి వచ్చిన వాసవీ మాలధారులు ఆలయం ప్రాంగణంలో గణపతి, వాసవీ హోమాలు నిర్వహించి మాల విరమణ గావించారు. ఆలయంలోని శాశ్వత నిత్యాన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో వందలాది మంది భక్తులకు అన్నప్రసాదం అందించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గుబ్బల రామపెద్దింట్లురావు, వాసవీ యువజన సంఘ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. వాసవీ యువజన సంఘం, ఆర్యవైశ్య సంఘాలు, వాసవీ క్లబ్ సభ్యులు వందలాది మంది పాల్గొనగా వాసవీ మాతకు వెండి రథోత్సవం జరిపారు.



ప్రత్యేక అలంకరణలో మూలవిరాట్ వాసవీ మాత

సాధన చేస్తే.. భారం కాదు



వెయిట్ లిఫ్టింగ్‌పై మెళకువలు చెబుతున్న కోచ్ రమేష్



వెయిట్ లిఫ్ట్ చేస్తున్న క్రీడాకారులు



తొలి దశలో సాధన చేస్తున్న విద్యార్థి

వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా ఏలూరు ఇండోర్ స్టేడియంలో జిల్లా క్రీడా ప్రాధికారి సంస్థ ఏర్పాటు చేసిన వెయిట్ లిఫ్టింగ్ వేసవి శిక్షణ శిబిరం ఉత్సాహంగా సాగుతోంది. 8 నుంచి 14 ఏళ్ల వయసులో బాలబాలికలు ప్రతిరోజు ఉదయం సాయంత్రం శిక్షణ పొందుతున్నారు. శిక్షణ శిబిరంలో పాల్గొన్న బాల బాలికలు సాధన కొనసాగిస్తే భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభాపాటవాలు చాటి పతకాలు సాధించగలరని కోచ్ రమేష్ చెప్పారు. ఉచితంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు



రెండవ దశలో బరువెత్తుతున్న విద్యార్థి

పెళ్లింట్లో విషాదం

విద్యుదాఘాతంతో వధువు తండ్రి మృతి



వెంకటేశ్వరరావు మృతదేహం

కామవరపుకోట: ఇంకా ఒక్కరోజులో పెళ్లి బాజాలు మోగాల్సిన ఆ ఇంట్లో వధువు తండ్రి హఠాన్మరణంతో విషాదఛాయలు అలుముకున్నాయి. బంధువులు, తడికలపూడి ఎస్సై చెన్నారావు తెలిపిన వివరాల ప్రకారం మండలంలో ఆడమిల్లి గ్రామానికి చెందిన మెతుకుమిల్లి వెంకటేశ్వరరావు (46)కు గ్రామ శివారు మద్దుకూరులో 3 ఎకరాల పామాయిల్ తోట ఉంది. బుధవారం ఉదయం పామాయిల్ తోటలో కత్తి కట్టిన ఇనప రాడ్డుతో ఆయిల్‌పామ్ మట్టలు నరుకుతుండగా ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక రైతులు గమనించి బంధువులకు, పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై చెన్నారావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంకటేశ్వరరావుకు భార్య వేణు, ఇద్దరు కుమార్తెలు. రెండవ కుమార్తెకు గురువారం వివాహం జరగాల్సి ఉండగా ముందురోజు ఇలాంటి ఘటన చోటుచేసుకోవడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ప్రైవేట్ ట్రావెల్స్ నిర్లక్ష్యం.. ప్రయాణికులకు ఇక్కట్లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు యాజమాన్యం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. తరుణి ట్రావెల్స్ ప్రైవేట్ బస్సు మంగళవారం రాత్రి హైదరాబాద్ నుంచి విశాఖపట్నానికి బయలుదేరింది. బస్సు కండీషన్ సరిగా లేకపోవడంతో రాత్రంతా మధ్యమధ్యలో ఆపుతూ ప్రయాణికులకు నరకం చూపారు. తెల్లవారుజామున ఏలూరు సమీపంలోని కలపర్రు టోల్‌గేట్ వద్దకు వచ్చిన తరువాత ఒక రెస్టారెంట్ వద్ద డ్రైవర్ బస్సును నిలిపివేసి ఇక ఈ బస్సు బయలుదేరదని, ప్రయాణికులు ఎవరిదారిన వారు విశాఖపట్నం వెళ్లిపోవాలని సూచించాడు. దీంతో ప్రయాణికులు వాగ్వివాదానికి దిగారు. అయినప్పటికీ నిర్వాహకులు స్పందించకపోవడంతో దాదాపు 5 గంటల పాటు ప్రయాణికులు అక్కడే ఆగిపోవాల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న ఏలూరు జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం స్పందించి ట్రావెల్స్ యాజమాన్యంతో చర్చించి 30 మంది ప్రయాణికులకు టికెట్ చార్జీలు చెల్లించే ఏర్పాటు చేశారు. దీనితో పాటు వారికి ఆహారాన్ని అందించారు. అనంతరం ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణమయ్యారు. ఈ ఘటనపై తరుణి ట్రావెల్స్ యాజమాన్యంపై కేసు నమోదు చేసినట్లు డీటీసీ కరీమ్ తెలిపారు.

ఆక్వాకు ఆక్సిజన్ గండం

- విపరీతమైన ఎండలు, అకాల వర్షాలతో అనర్థం
- ఒక పక్క ఉక్కబోత.. మరో పక్క విద్యుత్‌కోత



చెరువులలో తిరుగుతున్న ఏరియేటర్లు



కౌంట్‌కు రాకుండానే పట్టివేస్తున్న రొయ్యలు



అర్ధాంతరంగా పట్టివేసిన చేపలు

గణపవరం: పూటకోరకంగా మారుతున్న వాతావరణం ఆక్వా సాగుకు గండంగా మారింది. ఇటీవల దారుణంగా పడిపోయిన చేపలు, రొయ్యల ధరలు పెరిగి ఆక్వారంగం కొద్దిగా కుదుట పడుతున్న సమయంలో పదిరోజులుగా వాతావరణ మార్పులు రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. విపరీతమైన ఎండలు ఒకపక్క, మబ్బులు కమ్మి, వర్షం జల్లులు మరోపక్క ఆక్వా సాగును కుదేలు చేస్తున్నాయి. ఈ సమస్యలకు తోడు ఎడా పెడా విధిస్తున్న విద్యుత్ కోతలు ఆక్వా రైతులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. విద్యుత్ కోతల కారణంగా ఏరియేటర్లు తిరగడానికి ఆయిల్ ఇంజన్లు సిద్ధం చేసుకుంటున్నారు. ఆయిల్ ఇంజన్‌ల వినియోగానికి రోజూ వేలల్లో డీజిల్ కొనుగోలు చేయాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అర్ధాంతరంగా చేపలు, రొయ్యల పట్టివేత

ఎండకాస్తే విపరీతమైన ఉక్కబోత.. అప్పటికప్పుడు ఉన్నట్టుండి ఎండమాయమై, మబ్బులు కమ్మి ఒక్కసారిగా వాతావరణం చల్లబడిపోవడంతో ఆక్వా చెర్వులలో ఆక్సిజన్ సమస్య తలెత్తి చెర్వులలో చేపలు రొయ్యలు మూతులు పైకెత్తి నీటి ఉపరితలంపై అసహనంగా తిరుగాడుతున్నాయి. కొన్నిచోట్ల చేపలు, రొయ్యలు చనిపోయి నీటిపై తేలుతున్నాయి. ఈ సమస్యను అధిగమించడానికి రైతులు నిరంతరం చెర్వులలో ఏరియేటర్లు తిప్పుతున్నారు. చెర్వులలో ఇంజన్లు వేసి నీటిని రీసైక్లింగ్ చేస్తూ, నిరంతరం నీటిలో కదలిక తేవడం వల్ల ఆక్సిజన్ సమస్యను కొంతవరకూ అధిగమిస్తున్నారు. ఆక్సిజన్ లోటు పూడ్చడానికి రసాయనాలు చల్లుతున్నారు. ఆక్సిజన్ అందక చేపలు, రొయ్యలు మేతలు సరిగా తినలేక నీరసించి పోతుండటంతో రైతులు యుద్ధప్రాతిపదికన పట్టివేసి అయినకాడికి అమ్ముకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 1.25 లక్షల ఎకరాల్లో రొయ్య, మరో 1.50 లక్షల ఎకరాల్లో చేపలసాగు జరుగుతుంది. వాతావరణం ప్రతికూలంగా మారడంతో నియోజకవర్గంలో దాదాపు నాలుగువేల ఎకరాలలో చేపలు, రొయ్యలు అర్ధాంతరంగా పట్టివేసినట్లు అంచనా.

నిరంతరం ఏరియేటర్లు తిప్పాలి

చెరువులలో ఉష్ణోగ్రతలు తగ్గకుండా నిరంతరం ఏరియేటర్లు తిప్పుతూ నీటిని రీసైక్లింగ్ చేయాలని మత్స్యశాఖ అధికారులు సూచిస్తున్నారు. ఆక్సిజన్ లోపనివారణకు పొటాషియం పర్మాంగనేటు సిద్ధంగా ఉంచుకుని, అవసరం మేరకు చెర్వులో చల్లుతుండాన్నారు. ఆక్సిజన్ సరిపడా అందకపోవడంతో చేపలు, రొయ్యలు మేతలు సరిగా తినని కారణంగా పరిమితంగా మేతలు వేస్తుండాలని, ఆక్సిజన్ సమస్య ఉన్న సమయంలో చెర్వులలో మేత, సేంద్రియ ఎరువులను వేయడం పూర్తిగా మానివేయాలని సూచించారు.

ప్రైవేట్ బస్సును ఢీకొన్న బైక్

ఒకరి మృతి.. మరొకరికి గాయాలు

పెనమలూరు: ప్రైవేటు బస్సును మోటార్‌సైకిల్ ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. పెనుమూలూరు మండలంలోని పోరంకి సెంటర్‌లో విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిపై ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సీఐ వెంకటరమణ కథనం మేరకు.. నూజివీడు హజరయ్యపేటకు చెందిన కలపాల బోస్, ఎం.కృష్ణతారక్ (35) పెయింటర్లు. తాడిగడప శ్రీనగర్‌కాలువ కట్ట వద్ద వీరు నివసిస్తున్నారు. పెయింటింగ్ పనుల కోసం మంగళవారం రాత్రి ఇద్దరు బైక్‌పై పెనమలూరు సెంటర్‌కు వెళ్లారు. రాత్రి బైక్‌పై ఇంటికి వస్తుండగా పోరంకి సెంటర్‌కు వచ్చేసరికి ముందు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఒక్కసారిగా ఆగగా వీరి బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో కృష్ణతారక్, బోసుకు గాయలయ్యాయి. క్షతగాత్రులను విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కృష్ణతారక్ మృతి చెందాడు.

ఏటీఎం కార్డు మార్చి డబ్బులు స్వాహా

ఏలూరు టౌన్: ఏటీఎం కార్డు మార్చి వేసి ఏకంగా రూ. లక్షా 51 వేల నగదు స్వాహా చేసిన ఘటన ఇది. వివరాల ప్రకారం.. ఏలూరుకు చెందిన కందుల సత్యనారాయణ భీమవరం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈనెల 3న ఆయన ఏలూరు పాతబస్టాండ్ సెంటర్లో ఒక ఏటీఎంకు నగదు డ్రా చేసేందుకు వెళ్లాడు. అక్కడ క్యూలో ఉన్న వ్యక్తికి తన కార్డు ఇచ్చి రూ.1000 డ్రా చేయమన్నాడు. ఆ అపరిచిత వ్యక్తి రూ.1000 డ్రా చేయడంతోపాటు ఏటీఎం కార్డు మార్చివేసి సత్యనారాయణకు ఇచ్చాడు. ఆ తరువాత ఆ కార్డుతో రూ.లక్షా 51 వేలు డ్రా చేసుకున్నాడు. బాధితుడు సత్యనారాయణ ఈనెల 6న తన జీతం డబ్బు డ్రా చేసుకునేందుకు వెళ్లగా విషయం తెలిసింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా ఏలూరు టూటౌన్ సీఐ అశోక్ ఆదేశాలతో బుధవారం కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా ఐసెట్ పరీక్షలు



వాసవిలో ఐసెట్ పరీక్షకు హాజరైన విద్యార్థులు

తాడేపల్లిగూడెం: ఎంబీఏ, ఎంసీఏ కోర్సులలో ప్రవేశాలకు గాను నిర్వహించే ఐసెట్ పరీక్షలు పట్టణంలోని వాసవి, శశి ఇంజనీరింగ్ కళాశాలల్లో బుధవారం ప్రశాంతంగా పరీక్షలు జరిగాయి. వాసవీలో ఉదయం 230మందికి గాను 215 మంది, సాయంత్రం జరిగిన పరీక్షకు 231 మందికి గాను 206 మంది హాజరయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకరరావు తదితరులు పర్యవేక్షించారు. శశి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షకు ఉదయం జరిగిన పరీక్షకు 220 మందికి గాను 205 మంది హాజరుకాగా, సాయంత్రం జరిగిన పరీక్షకు 222 మందికి గాను 202 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాధికారి పి.రాంబాబు పర్యవేక్షించారు.

నీటి నిల్వలు లేకుండా చూడాలి



తణుకులో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్: దోమ రహిత సమాజ స్థాపన కోసం లార్వా జనిత ప్రదేశాలు లేకుండా చూడాలని, ఇళ్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని సబ్ యూనిట్ అధికారి జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు 2వ వార్డు గణేష్ నగర్‌లో బుధవారం గ్రౌండ్ లెవెల్ మస్కిటో బ్రీడింగ్ సోర్సెస్, కీటక జనిత వ్యాధులపై నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ స్వచ్ఛత బాట పట్టాలని, చెత్తను ఇండ్ల ఆవరణల్లోను, పరిసరాల్లోను , ఖాళీ స్థలాల్లోకానీ వేయరాదని, డ్రైనేజీల్లో కానీ వేయరాదని సూచించారు. డ్రైనేజీల్లో మురుగునీరు పారుదలకు ఆటంకం కలిగితే దోమల పుట్టుకకు స్థావరాలుగా మారుతున్నాయని, మార్పురాకుంటే దోమకాటు జనిత వ్యాధుల సంఖ్య పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఫైలేరి యా కంట్రోల్ యూనిట్ హెల్త్ సూపర్‌వైజర్ కె.సత్యనారాయణ, వార్డు హెల్త్ సెక్రెటరీ వి.వెంకటలక్ష్మి, ఆశా కార్యకర్త వై.సువార్తమ్మ పాల్గొన్నారు.

ఉపాధి శ్రామికులకు రూ.12 వేలు కూలీ భరోసా ఇవ్వాలి



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న శ్రామికులకు తెలంగాణా రాష్ట్రంలో ఇస్తున్నట్టుగా రూ.12వేలు కూలీ భరోసా ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని మెట్ట ఉప్పరగూడెం, చినతాడేపల్లి, కొండ్రుప్రోలు, కుంచనపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పథకం శ్రామికులను స్వయంగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు రూ.20వేలు ఇస్తానని హామీనిచ్చిందని, ఈ పథకం అమలుకు ప్రభుత్వం సిద్ధమవుతుందన్నారు. ఈ తరుణంలో కార్మికులు, కర్షకులను దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న శ్రామికులకు కూలి భరోసా ఇవ్వాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దిద్దే నాగేశ్వరరావు, శ్రామికులు పాల్గొన్నారు.

రాచర్లలో మద్యం విక్రయదారుడి అరెస్టు



బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన ఎక్సైజ్ సిబ్బంది

పెంటపాడు: అక్రమంగా బెల్ట్‌షాపుల పేరిట మద్యం అమ్మితే చర్యలు తప్పవని, వ్యక్తి అరెస్టుతో అపరాధ రుసుము కూడా భారీగా విధిస్తామని గూడెం ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి పేర్కొన్నారు. ఆమె ఆధ్వర్యంలో బుధవారం రాచర్ల గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని ఎస్‌ఐలు మురళి, దొరబాబు, సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 10 డ్యూటీ పెయిడ్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు స్వరాజ్యలక్ష్మి తెలిపారు.

వైఎస్సార్ కాలనీపై చిన్నచూపు



సవిత్రుపేట బోదిగొట్టు వద్ద ఖాళీ స్థలం, అస్తవ్యస్త పరిస్థితులు, మురుగు గుంట, పందులు



వైఎస్సార్ కాలనీలో అస్తవ్యస్తంగా ఉన్న అంతర్గత రహదారి, ఖాళీ స్థలం

- మౌలిక వసతులు కల్పించడంపై దృష్టి చూపని అధికారులు
- సీసీ డ్రైయిన్ నిర్మాణాలు చేపట్టాలి
- పందుల బెడదను అరికట్టాలి
- కుంచించుకుపోతున్న పంట బోదె



వైఎస్సార్ కాలనీలో కదలని మురుగు డ్రైయిన్



మురుగుబోదెగా పంట బోది గట్టు ప్రాంతం



వైఎస్సార్ కాలనీలో అభివృద్ధి చేయాల్సిన అంతర్గత రహదారి, విద్యుత్ పోల్స్ లేని రహదారి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని 15వ వార్డు శివారులో పలు సమస్యలు వేధిస్తున్నాయి. ఈ ప్రాంతంలో బోదిగట్టు ప్రాంతం, వైఎస్సార్ నగర్ మీదుగా కబేళ్ల రోడ్డు మార్గం ప్రాంతాలు ఉన్నాయి. ఇక్కడ నివాసం ఉంటున్న ఆయా ప్రాంతాల ప్రజలు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. అయా సమస్యలను పరిష్కరించాలని అక్కడ స్థానికులు పురపాలక సంఘం అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకుంటున్నారు.

సమస్యల వలయంలో వైఎస్సార్ నగర్

వైఎస్సార్ నగర్‌లో పలు సమస్యలు ఉన్నాయి. సుమారు పది వరకు అంతర్గత మట్టి రహదారులు ఉన్నాయి. తక్షణమే వాటిని సీసీ రోడ్లుగా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు. డ్రెయిన్‌లు నిర్మాణం, అవసరమైనచోట్ల ముఖ్యంగా విద్యుత్ పోల్స్ నిర్మాణం చేయాల్సి ఉంది. స్ట్రీట్ లైట్స్ చాలా ప్రాంతాలలో వెలగడం లేదని అంటున్నారు. అతి ముఖ్యంగా కుళాయిలు సమస్యలు ఉన్నాయి. ఇతర మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. కొన్ని ప్రాంతాలలో ప్రజలు తాగునీటి కోసం ఎంతో ఇబ్బందులు పడుతున్నారు. పలు ప్రాంతాలలో నీటి కుళాయిలు సైతం అసలు లేవు.

మునిసిపల్ ప్రాథమిక పాఠశాల రోడ్డులో సమస్యలు

సవిత్రుపేటలో బోదిగట్టు నుంచి ప్రాథమిక పాఠశాలకు సీసీ రహదారి నిర్మించినప్పటికి ప్రధాన సీసీ డ్రెయిన్ పనులు జరగలేదు. పాఠశాల శివారు ప్రాంతంలో పలు రహదారులు, డ్రెయిన్‌లు నిర్మాంచాల్సి ఉంది. ఇతర అభివృద్ధి పనులు చేయాల్సి ఉంది.

సమస్యల వలయంలో బోది గట్టు

గూడెం నుంచి ప్రత్తిపాడు వెళ్లే రహదారి మార్గంలో పట్టణంలో ఏలూరు కాలువ నుంచి పంట బోది ఒకటి సవిత్రుపేట మీదుగా దర్శిపర్రు బోదెగా వెళ్లుతుందిజ ఈ బోది మార్గంలో ఇరువైపుల ఇళ్ల నిర్మాణాలు, వివిధ ఖాళీ స్థలాలు ఉన్నాయి. బోది గట్టు మార్గం ప్రస్తుతం అస్తవ్యస్తంగా మారి ఉంది. బోది గట్టుకు రెండు వైపుల పటిష్టమైన గోడలు నిర్మించడంతో పాటు బోది గట్టు పొడువునా సీసీ రహదారి నిర్మాణం పనులు చేపట్టి అభివృద్ధి చేయాల్సి ఉంది.

అనేక ఇతర సమస్యలు ఉన్నాయి

వైఎస్సార్ నగర్, బోదిగట్టు ప్రాంతాలలో పలు సమస్యలు నెలకొని ఉన్నాయి. ఖాళీ స్థలాలు, ఖాళీ స్థలాలలో పిచ్చిమొక్కలు వేపుగా పెరిగాయి.ఈ ఖాళీ స్థలాలలో ఎక్కడ చూసిన పందుల బెడద కానవస్తుంది. కచ్చా డ్రెయినేజీలు కారణంగా వర్షకాలంలో అవి పొంగి పొర్లి రోడ్లను ముంచడంతో పాటు పలు ఇళ్లలోకి కూడా నీరు చేరుతుందని చెబుతున్నారు. మురుగు దుర్వాసన వెదజల్లుతున్నాయి. దోమల బెడద అధికంగా ఉంది. పాములు, తేళ్లు, విష జంతువులు, కుక్కల బెడద అధికంగా మారి ఉంది. బోది గట్టు వెంబడి ఉన్న ఖాళీ స్థలాలలో అసాంఘీక కార్యక్రమాలు జరుగుతున్నాయి.

రోడ్లు, డ్రెయిన్‌లు అభివృద్ధి చేయాలి



వైఎస్సార్ కాలనీలో అంతర్గత రహదారులను సీసీ రహదారులుగాను, సీసీ డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలి. కొన్ని ప్రాంతాలలో విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేయాలి. కుళాయిలు లైన్‌లు వేసి తాగు నీటి సమస్యలను పరిష్కరించాలి. అధికారులు స్పందించాలి.

– ముత్యాల వీర్రాజు, స్థానికులు

ఖాళీ స్థలాలను మెరుగుపర్చాలి



ఆయాప్రాంతాలలో నెలకొనిఉన్న ఖాళీ స్థలాలలో వ్యర్థాలను తొలగించాలి. అపరిశుభ్ర పరిస్థితులు లేకుండా చేయాలి. దోమల నివారణకు ప్రత్యేక కృషిచేయాలి. పాములు, విష జంతువులు బెడదను అరికట్టాలి. ప్రజా ప్రతినిధులు సమస్యలను పరిష్కరించాలి.

– ఎస్‌వీవీ సత్యనారాయణ, స్థానికులు

రహదారి నిర్మాణం ఎప్పుడు?

తణుకు అర్బన్: వేల్పూరు రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారి నిర్మాణం పనులు చేపట్టడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని సీపీఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ళ చినవీరభద్రరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. వేల్పూరు నుంచి మండపాక వెళ్లే రైల్వే స్టేషన్ రహదారి ఏళ్ల తరబడి ఈ రోడ్డు పెద్ద పెద్ద గోతులతో ప్రమాదకరంగా మారి రాళ్లు పైకి లేచిపోవడం వలన అనేకమంది వాహనదారులు పలు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు పది మాసాలు కావస్తున్న నేటికీ పనులుఎందుకు ప్రారంభించంలేదని విమర్శించారు. రోడ్డు నిమిత్తం కేటాయించిన నిధులు ఏమయ్యాయని, రోడ్డు నిర్మాణం పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు అనే విషయాన్ని గతంలో గ్రామ సభలో ప్రకటించిన అధికారులు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజలను కలుపుకొని ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరం



వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో సీతారామరాజు ఏకపాత్ర అభినయంలో కోపెళ్ళ శ్రీనివాస్

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక గ్రేడ్ –1 శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ఆసక్తికరంగా జరుగుతుంది. తొమ్మిదోవ రోజు బుధవారం రిసోర్స్‌పర్సన్స్‌గా హాజరైన ప్రత్తి వీరాస్వామిచే నీతి కథలు, ఎ.లక్ష్మణరావుచే పుస్తక సమీక్ష చేశారు. విద్యార్థులకు వివిధ ఆటలను ఆడడం నేర్పించారు. దేశ భక్తిగీతాలు నేర్పించారు. కోపెళ్ళ శ్రీనివాస్‌చే అల్లూరి సీతారామరాజు ఏకపాత్ర అభినయం చేసి చూపారు. సీతారామరాజు జీవిత విశేషాలను వెల్లడించారు. గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మరింత మంది విద్యార్థులు హాజరై శిక్షణను ఉపయోగించుకోవాలని, విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

వాహన బీమా తప్పనిసరి



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి పీవీఎస్ రంజిత్‌కుమార్

తణుకు అర్బన్: వాహనాలు నడిపే ప్రతిఒక్కరూ వాహనబీమా కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి పీవీఎస్ రంజిత్‌కుమార్ అన్నారు. రాష్ట్ర న్యాయ సేవల సంస్థ ఉత్తర్వుల మేరకు బుధవారం తణుకులో కార్మిక చట్టాలపై అవగాహన కల్పించేందుకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జూనియర్ సివిల్ జడ్జి పీవీఎస్ రంజిత్‌కుమార్ మాట్లాడుతూ ఇన్సూరెన్స్ పాలసీలు లేనివారు ఈ శ్రమ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకుని ప్రయోజనం పొందాలన్నారు. లేబర్ డిపార్టుమెంట్ అధికారులు కూడా ఆధార్‌కార్డుతో పోర్టల్‌లో పేర్లను నమోదు చేస్తారని, ఏసమస్య అయినా మండల న్యాయసేవల కమిటీ ద్వారా ఉచిత న్యాయ సహాయం, సలహాలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు లేబర్ డిపార్టుమెంట్ అధికారులు ఎం కిరణ్‌కుమార్, బి లక్ష్మణ్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్, సంఘ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఇంటి వీరన్న, అధ్యక్షుడు బి నాగరాజు, న్యాయవాదులు కొరు వెంకటేశ్వర్లు, ఎ అజయ్‌కుమార్, పి శ్రావణిసమీరా, టి సత్యనారాయణ, కె జస్పాల్ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలకు బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు



ఏబీసీ కేంద్రానికి తీసుకెళుతున్న వాహనం వద్ద మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నేతల రాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వీధి కుక్కలు జనాభా పెరుగుదలను ఆపేందుకు బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు చేస్తున్నామని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నేతల రాజు అన్నారు. మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు ఆదేశాలు మేరకు హెల్త్ ఆఫీసర్, సెక్రటరీ, సిబ్బంది ఆధ్వర్యంలో స్నేహ సిబ్బందిచే 10, 12 వార్డుల్లో మంగళవారం కొన్ని వీధి కుక్కలను ఆపరేషన్లు చేయించే నిమిత్తం పలు కుక్కలను పట్టుకుని ఏబీసీ కేంద్రానికి తరలించారు. నేతల రాజు మాట్లాడుతూ పాతూరులోని యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కేంద్రంలో మగ కుక్కలకు ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని చెప్పారు. పట్టణంలో 1120 వీధి కుక్కలు ఉన్నాయని, ప్రస్తుతం డాక్టర్ సుకేష్ బృందంచే 140 కుక్కలకు ఆపరేషన్లు చేసినట్లు వెల్లడించారు. రోజుకు 10 కుక్కలకు చొప్పున ఆపరేషన్లు చేస్తున్నట్లు, అనంతరం వాటిని బోన్‌లలో ఉంచి మాంహాసారం, గుడ్లు అందజేస్తున్నామని, తాగునీరు అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ మగ కుక్కలకు ఆపరేషన్లు చేస్తున్నామని, అనంతరం ఆడ కుక్కలకు ఆపరేషన్లు చేస్తామని ప్రజలు సహకరించాలని కోరారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో చెట్ల నరికివేత



ఆర్టీసీ బస్సు గేటు వద్ద నరికేసిన పెద్ద వృక్షం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వృక్షో రక్షితి రక్షితః అంటూ వృక్షాలను (చెట్లను) పెంచాలని నినాదాలు ఇచ్చే ప్రభుత్వం, యాజమాన్యాలు ఎన్నో సంవత్సరాలుగా ఉంటున్న చెట్లను ప్రభుత్వ ఖాళీ స్థలాలను లీజ్‌కు ఇచ్చే పేరుతో నరికి వేయడం ఏమిటని ప్రకృతి ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లో వెళితే పట్టణంలోని ఏపీఎస్ ఆర్టీసీకి ఉన్న విశాలమైన ప్రాంగణంలో డిపోతో పాటుగా కాంప్లెక్స్ ఉంది. ఆర్టీసీ ఆదాయ వనరులు సమకూర్చుకునే క్రమంలో ప్రాంగణంలో ఉన్న స్థలాలను ఒక్కొక్కటిగా చదరపు అడుగులు లెక్కన విడదీసి చాలా వరకు ప్రైవేట్ వ్యక్తులకు లీజుకు ఇచ్చారు. దీంతో విస్తీర్ణం చాలా వరకు తగ్గిపోయింది. ఇది ఇలా ఉంటే బస్సు కాంప్లెక్స్ ఇన్‌గేట్ సమీపంలో బస్సులు ఆగే ఖాళీ స్థలంలో ఉన్న 500 చదరపు అడుగుల మేర స్థలాన్ని లీజ్‌కు ఇచ్చారు. ఈ స్థలాన్ని శుభ్రపరిచే క్రమంలో అందులో ఉన్న ఓ పెద్ద చెట్టును కొట్టివేశారు. ప్రయాణికులకు నీడను ఇచ్చే ఆర్టీసీ ఆవరణలో చెట్లను నరకడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆర్టీసీ డీఎం వైఎస్ఎన్ మూర్తిని వివరణ కోరగా ఆర్టీసీ ఆదాయ వనరులు సమకూర్చుకునే క్రమంలో స్థలాలను లీజ్‌కు ఇస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇచ్చిన స్థలంలో ఒక చెట్టు మాత్రమే తొలగించారని, పర్యావరణానికి విఘాతం కలగకుండా చూస్తామని, తొలకరి జల్లులు మొదలైన వెంటనే కాంప్లెక్స్ ఆవరణలో మొక్కలను నాటి వాటిని రక్షిస్తామని వివరించారు.

క్రీడలతో శారీరక దారుఢ్యం



మాధవరం గ్రామంలో సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం రూరల్: శారీరక దారుఢ్యానికి క్రీడలు ఎంతగానో ఉపకరిస్తాయని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల వైపు యువత దృష్టి సారించాలన్నారు. క్రీడల ద్వారా ఎంతో మంది ఉన్నత శిఖరాలను చేరుకున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశ రక్షణ రంగం వైపు యువత అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. గ్రామ సర్పంచ్ ముప్పిడి సూర్యకుమారి, మాజీ సర్పంచ్ కవులూరి పరిమళ, నాయకులు లక్కాకుల ప్రసాద్, కస్సే శ్రీనివాస్, అడ్డగర్ల ప్రసాద్, ఆకుల తాతారావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్లూరి జీవితం స్ఫూర్తిదాయకం



తణుకులో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పిస్తున్న ఏఐఎస్‌ఏ నాయకులు



అత్తిలి శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న క్షత్రియులు

తణుకు అర్బన్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితం యువత, విద్యార్థులకి ఆదర్శవంతమని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్‌ఏ) జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి అన్నారు. అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి సందర్భంగా తణుకు డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బ్రిటిష్ సామ్రాజ్య వాదులను గడగడలాడించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అన్నారు. సాయుధ పోరాటం స్వాతంత్ర ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యయనమని సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం వస్తుందని నమ్మి దానికోసం తమ ప్రాణాలను అర్పించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుడని కొనియాడారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డి.వెంకటేష్, కె.గంగాధర్, సీహెచ్ కరుణాకర్, వై.సత్యసాయి, పి.హర్ష తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి

అత్తిలి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో మన్యం ప్రజల ఆరాధ్యదైవం, విప్లవ వీరుడు అల్లూరిసీతారామరాజు వర్ధంతిని బుధవారం జరిపారు. గ్రంథాలయాధికారి డి కృష్ణారావు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేసవి శిక్షణలో భాగంగా రిసోర్సుపర్సన్ బి నాగేశ్వరరావు విద్యార్థులచే పుస్తక పఠనంలో కథలు చదివించి, నీతిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి పెద్దబాల శిక్ష చదవడం అలవర్చుకోవాలన్నారు. పెద్దబాల శిక్షలోని విషయ పరిజ్ఞానాన్ని వివరించారు. వి లక్ష్మణరావు, పి వెంకటేశ్వరరావు, గంధం శేషవేంద్రరావు, శ్రీదేవి, హేమశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

విప్లవ జ్యోతి అల్లూరికి ఘన నివాళులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విప్లవ జ్యోతి, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితం ఆదర్శనీయమని పలువురు వక్తలు కొనియాడారు. సీతారామరాజు 101 వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద అల్లూరి విగ్రహానికి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేరిచర్ల ఫౌండేషన్ మురళీ కృష్ణంరాజు, క్షత్రియ సేవా సమాఖ్య చెరుకువాడ అప్పల రామకృష్ణవర్మ, కళాకారుల సంఘ రాష్ట్ర ప్రతినిధి కూనిరెడ్డి శ్రీనివాస్, పాతూరు నాయకులు దాట్ల జగన్నాధరాజులు మాట్లాడుతూ మన్యం వీరుడు సీతారామరాజును స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విస్సం రాజు, గాదిరాజు వెంకట రామరాజు, ఆనందరావు, వి.సత్యనారాయణ రాజు, రమాకాంత్ రాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే అల్లూరి సీతారామరాజు 101 వర్ధంతి సభను బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌లోని యూనియన్ కార్యాలయంలో బుధవారం నాయకులు చిర్ల పుల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. అల్లూరి చిత్రపాటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో నాయకులు సిరపరపు రంగారావు, చల్లా చంద్రరావు, బంకురు నాగేశ్వరరావు, కరక వెకంట్రావు, కె.అప్పన్నలు సీతారామరాజు జీవిత విశేషాలను వెల్లడించారు. సిరపు మహేష్, గణేష్, డి.సీతయ్య, జి.రమేష్, చీర వెంకన్న, మీసాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు ఆరుగొలను రోడ్డులోని రైల్వే ట్రాక్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. తణుకు డిపోలో ఆర్టీసీలో కండెక్టర్‌గా పనిచేస్తున్న ఏడిద వెంకటరావు డ్యూటీ నుంచి స్వగ్రామం ఆరుగొలను మోటార్‌సైకిల్‌పై వస్తుండగా ప్రత్తిపాడు రైల్వే ట్రాక్ సమీపంలో ఆరుగొలను నుంచి ప్రత్తిపాడు వైపు వెళ్తున్న క్వారీ లారీ ఢీకొట్టడంతో తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. మోటార్ సైకిల్ లారీ కిందకు వెళ్లిపోయింది. కాగా ఆతని కుడి కాలు నుజ్జు,నుజ్జు అయ్యింది. స్థానికులు వెంటనే గూడెంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా వాసవీ మాత జయంతి వేడుకలు



విశేష అలంకరణలో వాసవీమాత

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవీ మాత జయంతి వేడుకలు స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో బుధవారం ఘనంగా జరిగాయి. విఘ్నేశ్వర పూజ, 108 వెండికలశములతో కలశపూజ, 108 సువాసినిలతో ప్రత్యేక పూజలు. అమ్మవారి మూలవిరాట్టుకు పంచామృతాలతో, ఫలరసాలతో, సుగంధ ద్రవ్యాలతో, పసుపు, కుంకుమలతో విశేష అభిషేకాలు జరిగాయి. మహిళలచే కుంకుమ పూజలు, లలిత సహస్ర పారాయణంలు నిర్వహించారు. భక్తుల సహకారంతో అమ్మవారికి సుమారు 10కేజీల వెండితో వెండి కమల పీఠం సమర్పించారు. విశేష అలంకరణ గావించారు. తొలుత వాసవి క్లబ్ వారిచే బైక్ ర్యాలీ జరిగింది. అన్నదానం ఏర్పాటు చేశారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు మారం వెంకటేశ్వరరావు, నున్న బాల త్రిపుర సుందరరావు, కొర్లపర శ్రీరామచంద్రమూర్తి, పేరూరు కాశయ్య, పొన్నగంటి స్వర్ణకాంతి, కె.సునీత, పి.శారదారాణి, ఆర్యవైశ్య సభ్యులు పాల్గొన్నారు.

సత్యసాయి మందిరంలో ప్రత్యేక పూజలు



ఈశ్వరాంబ పుణ్యతిథి కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక శ్రీ సత్యసాయి మందిరంలో మాతృశ్రీ ఈశ్వరాంబ పుణ్యతిధిని బుధవారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బాల వికాస్ బాలబాలికలచే నిర్వహించారు. అష్టోత్తర శత నామవళి, తందూలార్చన జరిగింది. బాల వికాస్ విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. మాతృదేవత నాటిక ప్రదర్శించారు. బహుమతులు అందజేశారు.

భవన నిర్మాణ కార్మికులకు అవగాహన

పాలకోడేరు: అసంఘటిత కార్మికులకు అనేక చట్టాలు రూపొందించబడ్డాయని, వాటిని సద్వినియోగం చేసుకోవలసిన బాధ్యత ప్రతి కార్మికుడిపై ఉందని భీమవరం రెండో అదనపు జుడీషియల్ మేజిస్ట్రేట్ ఎస్.జ్యోతి అన్నారు. మండలంలోని కుముదవల్లి గ్రామ సచివాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సుకు న్యాయమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని కార్మిక చట్టాలు, అటల్ పెన్షన్ యోజన, సురక్ష బీమా యోజన, తదితర పథకాలపై కార్మికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యేలేటి యోహాన్, సర్పంచ్ వంశీ కృష్ణంరాజు, పంచాయతీ సెక్రటరీ వై.బాలకృష్ణ పాల్గొన్నారు.